

# పల్లెటూరి షాదీలో జజ్జనక!

ఈ జజ్జనకకు ప్రదాన కారణకర్తలు యింకెవురో కాదు.

ఒకామె మా అమ్మ. యింకొకామె మా నజీరత్త.

యీ అమ్మతల్లులిద్దరూ చేసిన పనికి మా చినత్త కొడుకు పెళ్లిలో జరిగింది సామీ కతా... ఒక తట్టు తమాషా. యింకో తట్టు గలాటా.

ఒకసారి మా చినత్త కొడుక్కి సంబందం చూసి రావడానికని మా చినత్త కుటుంబంతోపాటు మా అమ్మా, నాయినా, మా నజీరత్తా వెళ్లేసొచ్చినారు ఒక పల్లెటూరుకి. మాటలయినాయి. యిచ్చిపుచ్చుకునేది కూడా ఉరామారీగా అనుకున్నారు. పెళ్లి కూతురి తరుపు నుంచి మాట ఖాయం చేసుకున్నారు. యింక పెళ్లికొడుకు తరుపోల్ల మాటే బాకీ. పెళ్లికొడుకు తరుపోల్లు 'ఊ' అనాలంటే ముందు పెళ్లి కొడుకు 'ఊ' అనాలి.

పెళ్లి కొడుకు 'ఊ' అనాలంటే పెళ్లికూతురు ఎట్లుంటుందో ఆయనకి తెలియాలి గదా. ఆణ్ణుంచి మొదలయ్యింది కత.

ఏమంటే- మా యిళ్లల్లో పెళ్లిళ్లంటే అబ్బాయిని అమ్మాయిగానీ అమ్మాయిని అబ్బాయిగానీ చూసుకునేదానికి లా. పోటోల్లో కూడా చూసుకోకూడదన్న మాట. అబ్బాయి తరుపోళ్లలో కొందరు పోటోలు యిస్తారుకానీ అమ్మాయి తరుపోళ్లు మాత్రం సచ్చినా యివ్వరు. గోషా.

అందువల్ల మా చినత్త కొడుకు కూడా అమ్మాయినిగానీ అమ్మాయి పోటోనిగానీ చూసే బాగ్యానికి నోచుకోలా. అమ్మాయిని చూసొచ్చినోళ్లు ఎట్ల చెబితే అట్ల ఊహించుకోవడమే పాపం ఆయన పని.

అయితే, యీణ్ణే మా చినత్త కొడుకు బుద్ది పొరపాటు పని చేసినాడు. పెళ్లికూతురు ఎట్లుంటదనే సంగతిని మా చినత్తను అడగడానికి మొహమాట పడి బుద్దినేరకపోయి మా అమ్మనీ మా నజీరత్తనీ అడిగినాడు.

అసలికే వాళ్లిద్దరూ తాటాకులు కట్టే రకాలు. ఎవురన్నా దొరికితే ఒదులుతారా? ఆడుకునేసినారు మనోణ్ణి.

'నాయినా! ఏమి తారీఫు చేయమంటావుపో' అని మెల్లగా యిస్టార్టు చేసింది మా అమ్మ, పెళ్లి కూతురిని వర్ణించడానికి బరువుగా మొకం పెడతా.

'మాటలు చాలవురా సామీ... అబ్బ... ఏమి అందం... ఏమి కనుముక్కు' అంటా అందుకొనింది మా నజీరత్త.

'కడిగి నీళ్లు తాగాల్సిన రంగులే అది. తెల్లటి తెలుపనుకోపో-యేమీ' అని ఒకరూ... 'నవ్విందంటే సిరిదేవి నవ్వినట్టే అబయా' అని యింకొకరూ... 'చీర కట్టుకొని నడిచిందంటే జయపర్దానే'... అంటా మళ్లొకరూ...

వాళ్లట్టా ఒకోమాటా చెప్పి తాటాకులు కడతా వుంటే మా చినత్త కొడుకు కుర్చీలో కూచొని ఒకో అంగుళం పొంగిపోతా వున్నాడు. అయితే ఆ పొంగు మీద సప్పంగా నీళ్లు చల్లేదానికి అప్పుణ్ణే మాయింటికి మా పెదత్త కొడుకు సమీరుభాయి వచ్చినాడు.

'రే... వీళ్ల మాటలు నమ్మినావో మునిగిపోతావు. ముందర పోటో చూసి ఆనేకనే ఊ అను' అంటా సలహో యిచ్చినాడు, అనుబవమ్మీద.

'ఏమి నాయినా? మేమంత అబద్దాలు చెప్పేవాళ్లంలాగా అవుపిస్తా వున్నామా నీకూ?'- అనింది నజీరత్త, సమీర్‌భాయితో.

'నాకు తెలియదా మీ కతా? నా కోసం నెల్లూరులో పిల్లను చూసొచ్చి ఏమని చెప్పినారమ్మా మీరిద్దరూ? పిల్ల ఎర్రటి ఎరుపు అని చెప్పలా. నిఖా టయానికి నల్లటి నలుపులో ఎట్టా మారిపోయింది? మీ మాటలు నమ్మి బావిలో దూకినాను కదా తల్లుల్లారా'...అన్నాడు సమీరుభాయి, అలనాడు పోటో కూడా చూడకుండా నల్లటమ్మాయిని పెళ్లిచేసుకున్న బాదతో.

'అప్పుడంటే ఏదో భ్రాంతిలో ఉండి అట్టా చెప్పినాముకానీ ఇప్పుడు మాత్రం మేము చెప్పేది నిజం. వీడికి చూసిన పిల్లకి వంక పెట్టేదానికి లా. పల్లకిలో దిగొచ్చిన దేవకన్నే అనుకో' అనింది మా నజీరత్త.

'దేవకన్నో, అప్సరసో నాకెందుకు? ముందు పోటో తీసకరండి. అప్పుడు నమ్మతా' అన్నాడు సమీర్‌భాయి.

'యీయన మాటలు అట్టే వుంటాయికానీ నువ్వు మాత్రం నా మీద భరోసా పెట్టబయా. పిల్ల అందానికి పూచీ నాది' అనింది మా అమ్మ.

మా చినత్త కొడుకు కుర్చీలోనుంచి పైకి లేచినాడు.

'ఏమో తల్లుల్లారా! మీ మాటలు నమ్మినాను. పెళ్లికి ఆల్‌రైట్ అన్నానని మా అమ్మకు చెప్పండి' అనేసి వెళ్లిపోయినాడు. ఆయన పోతా వుంటే ఎట్టా ఆపాలో తెలియక నెత్తి కొట్టుకున్నాడు సమీరుభాయి..

'యిప్పటికైనా నిజ్జం చెప్పండమ్మా. పిల్ల మీరు చెప్పినట్టుగానే వుంటుందా' అని అడిగినాడు మళ్లా.

అప్పటిదాకా తాటాకులు కడతా వున్న మా అమ్మ, నజీరత్త యింక తమాషా ఆపి అసలు సంగతికొచ్చినారు.

'నాయినా! అబద్ధం చెప్పేదానికేముంది? ఆ పిల్ల చానా మంచి పిల్ల. ఉర్దూ అరబీ చదువుకునింది. కాకపోతే కొంచెం సాయ(ఛాయ) తక్కువ. చెప్పుకోతగ్గ అందగత్తె కాదు. అట్టాగని తీసిపారేయడానికి లేదు' అనింది మా అమ్మ.

'మరా మాట వున్నదున్నట్టుగానే వాడికి చెప్తే పోయేదికదా' అన్నాడు సమీరుభాయి.

'ఎట్ట చెప్పమంటావు నాయినా. మనిళ్లల్లో కూడా ఆడపిలకాయలు వున్నారు. వాళ్లేమైనా అందగత్తెలా? అప్సరసలా? ఈకాలపు పిలకాయలకి ఒకటికి నాలుగుచేసి చెబితేనే ఇళ్లల్లోంచి ఆడపిలకాయలు కదలడంలా. ఉన్నదున్నట్టు చెబితే పెళ్లిళ్లు అయ్యేదానికేనా? మనకు మన పిల్ల ఎంతో వాళ్లకి వాళ్ల పిల్ల కూడా అంతేకదా' అనింది మా నజీరత్త ఎంతో పెద్ద మనసుతో.

ఆ మాటల్లో మంచి గ్రహించకుండా 'సచ్చాళ్లే నా కొడుకు' అని గొణుక్కున్నాడు సమీరుభాయి.

రోళ్లు పగిలే ఎండాకాలం. పల్లెటూరిలో షాదీ.

మద్యానం రెండింటికి నిఖా అయిపోయింది. తాటాకు వొసారాలో దావత్ మొదలయ్యింది. ఒక తట్టు దావత్ జరగతా వుంటే యింకో తట్టు పెళ్లికొడుకేమో ఎప్పుడెప్పుడు సాయింత్రమవద్దా ఎప్పుడెప్పుడు పెళ్లికూతురిని చూద్దామా అన్నట్టుగా ఆరాటం ఆరాటంగా తిరగతా వున్నాడు.

సాయింత్రానికి జల్వా! (అంటే పెళ్లికొడుక్కి పెళ్లికూతురిని చూపించే కార్యక్రమం).

నవారు మంచం పరిచి ఒక తట్టు పెళ్లికొడుకుని, యింకో తట్టు పెళ్లికూతురిని కూచోపెట్టినారు అమ్మలక్కలు.

'చూడు పెళ్లికొడక చూడు. పెళ్లి కూతురు ఎట్టుందో చూడు' అని, ఒక ముత్తయిదువ పెళ్లి కూతురి మొకం మీదున్న మేలి ముసుగును తొలిగించింది.

అంతే. మనోడి మొకంలో నీళ్లెగిరిపోయినాయి. మామూలుగా చూసుంటే నచ్చేదేమోగానీ మా అమ్మా నజీరత్తా ఫుల్లుగా పంపుకొట్టి వదిలిపెట్టున్నారు కదా ఆ ఎక్స్పెక్టేషనుకు తగినట్టుగా పెళ్లికూతురు ఆనలా. దానికి తోడు ఏడ్చి ఏడ్చి (అట్టాగానీ ఏడ్వక పోతే 'అత్తారింటికి పోతున్నా ఆ పిల్ల కంట్లో చుక్క నీరు పుట్టలేదమ్మా' అని అమ్మలక్కలు ఆడిపోసుకుంటారు), ఎండలకి చెమట కార్చీకార్చీ నలుపులోకి తిరిగిపోయి వుంది పెళ్లికూతురి మొకం.

మనోడు ఆ మొకాన్ని చూడగానే జల్వాలా. గిల్వాలా. ఒక్క ఉదుటున పైకి లేచి, మంచం మీద నుంచి ఒక్క ఎగురు ఎగిరి దూకి, బస్టాండు తట్టు అదే పోవడం.

'పెళ్లికొడుకు అలిగెళ్లిపోయినాడు. పిల్ల నచ్చనట్టుంది' అనే మాట బయిటికొచ్చేసరికి ఆడోళ్లంతా 'చొచ్చొచ్చోలూ', మొగోళ్లంతా 'అరెరెరెలూ' అయిపోయినారు క్షణాల్లో.

పస్టు ఎఫెక్టయ్యింది పెళ్లి కూతురి తల్లి. 'దన్'మంటా సోదీనం తప్పి పడిపోయిందామె.

'పెళ్లికూతురోళ్లమ్మ పడిపోయింది... పెళ్లికూతురోళ్లమ్మ పడిపోయింది' అని పందిట్లో గోల మొదలుకాంగానే ఏమనుకుందో ఏమో మా చినత్త కూడా 'దన్'మంటా సోదీనం తప్పి పడిపోయింది.

'అరెరెరె... పెళ్లికొడుకోళ్లమ్మ కూడా పడిపోయిందే' అంటా పందిట్లో మళ్లా గోల.

మా చినత్త భర్త అదరాబదరాగా వచ్చి, మంచానికి యీ పక్క ఒకరు ఆ పక్క ఒకరు పడిపోయున్న ఆడోళ్లని చూసి తల పట్టుకున్నాడు. అప్పటికే ఆడపెళ్లోళ్లందరూ మల్లుకున్నారాయన్ని.

'య్యో పెద్దాయన! పెళ్లికూతురు ఎట్టుంటదో ముందే నీ కొడిక్కి చెప్పలా? మా యిజ్జత్ తీయడానికే చేసినావా యీ పెళ్లి' అంటా ఎగిరినారు.

వాళ్ల మాటలు వినంగానే సమీరుభాయి వచ్చేసినాడు రంగంలోకి.

'ఏందమ్మో పెద్ద చించుకుంటా వుండారో? అంత యిజ్జత్ వున్నోళ్లు పెళ్లికి ముందరే పెళ్లికొడుక్కి పెళ్లి కూతురి పోటో యిచ్చుండాల్సింది. దానిని వాడు ఒకటికి నాలుగుసార్లు చూసుకొనే చేసుకునుండే వాడు పెళ్లి. అట్టా చేయకుండా యిప్పుడు పెళ్లికొడుకు అలిగెళ్లిపోయినాడని కొంగులు బొడ్లో దోపుకుంటా వస్తే ఏమి లాబం?' అన్నాడు పెద్దగా.

ఆ మాటలకి పెళ్లికూతురి అన్న తోసుకొచ్చినాడు. 'యీ మనిషితో యింకేమీ మాట్లాడబాకండి. మనదే తప్పు. పోటోలు చూసి పెళ్లిళ్లు చేసుకొనే ఖాందాన్ తక్కువ వంశంలో మన పిల్లనివ్వడం మనదే తప్పు' అన్నాడు చురకేస్తా.

'మాది ఖాందాన్ తక్కువ వంశమా?' అన్నాడు సమీరుభాయి, చొక్కా చేతులు మడిచినంత పని చేస్తా. 'లాకుంటే మాది ఖాందాన్ తక్కువ వొంశమా?' అన్నాడు పెళ్లికొడుకు అన్న.

'మీ ఖాందాన్‌లను మట్టిలో పెట్టి కప్పెట్ట. ముందు పెళ్లి కొడుకును పట్టకరండయ్యా' అన్నారెవరో.

అంతటితో 'అవునుగదా' అనుకొని పోలోమంటా అందరూ బస్టాండుకు పరిగెత్తినారు. అందరికంటే పస్టుంది మా అమ్మ, నజీరత్త.

'మ్మో! మీకు దండం పెడతా. యింకేమీ చెప్పబాకండి. చేసింది చాలు' అన్నాడు పెళ్లికొడుకు వీళ్లద్దరినీ చూడగానే.

మా చినత్త బర్త వచ్చినాడు.

'రే. పా. యిది పద్దతి కాదు' అన్నాడు, అదిలిస్తా.

'నేను రాను. అట్టాంటి అమ్మాయినా చేసేది?' అన్నాడు పెళ్లికొడుకు, మొకాన్ని చిన్నగా చేసుకుంటా.

'నీ మొకం. ఎండకి సెగదెబ్బ తగిలి పిల్లట్టా వేలాడబడిందిగానీ వాస్తవానికి ఎంత కళనీ?

పాపా. సరిగా చూద్దూగానీ' అన్నాడు మా చినత్త బర్త.

పెళ్లికొడుకు కదల్లా. ఆయనకు కోపం వచ్చేసింది.

'ఏమి... తమాషాలా? కదులు. అవతల మీ అమ్మ సోదీనం తప్పి పడిపోయుంది' అన్నాడు జబ్బ పట్టుకుంటా.

మా చినత్త బర్త అదిలింపు కంటే మా చినత్త సోదీనం తప్పిన పదకమే పారి పెళ్లికొడుకు కదిలినాడు.

అయితే కడుపులో బాద తీర్చుకోవడానికన్నట్టు మా నజీరత్త బర్తను పిలిచి మా నజీరత్త ఏ తీరున తాటాకులు కట్టిందో మొత్తం చెప్పేసినాడు. పందిట్లో జరిగిన గలాటాకు అసలే పరేషానుగా వున్న మా నజీరత్త బర్తకు కారం పెట్టినట్టయ్యింది ఆ సంగతి తెలిసి.

అంతే. పందిరని కూడా చూడకుండా మా నజీరత్తని పిలిచీ తన్నినాడు చూడూ... పుణ్యానికి పోతే పాపం ఎదురైందనీ... జజ్జనకే.

(ఆ రోజట్టా మా నజీరత్త తన్నులు తిన్నా యీ రోజు మా చినత్త కొడుక్కి ముగ్గురు బిడ్డలు. జల్వాలో ఎవర్ని చూసయితే అలిగినాడో ఆమె మీద తెల్లారేపాటికి అలక తీర్చేసుకొని మరుసటి రోజు నుంచే సుకంగా కాపరం మొదలుపెట్టినాడాయన. అయితే యీ పెళ్లిలోని అలక కతని మా యిళ్లల్లో మొగపిలకాయలెవ్వరూ మర్చిపోలా. ఎవర్కైనా పెళ్లిచూపులు అంటే చాలు 'తల్లులారా! మీరెమీ చెప్పబాకండి. బాగున్నా బాగలాకపోయినా ఒక్కమారు పోటో చూపిచ్చెయండి' అని అంటా వున్నారు. ఆ పల్లెటూరి షాదీ తర్వాత మా యిళ్లల్లో అమ్మాయి పోటో చూడకుండా ఎవురి పెళ్లీ జరగలా).

